స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

క్లుప్తంగా

పాఠశాలకు కుర్చీల వితరణ

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు బుధవారం కరణం సంక్షేమ సంఘం వారు కుర్చీలను వితరణగా అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధనం జయరాజుకు కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు భాస్కర్ పిళ్లై, కార్యదర్శి రవీంద్రప్రసాద్, కోశాధికారి సుబ్రహ్మణ్యంపిళ్లై, ఉపకార్యదర్శి హరిహరప్రసాద్, లోకేష్, శంకరన్ పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం

పూతలపట్టు: యాదమరి మండలం జొన్నవాళ్ల మిట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మారియమ్మ ఆలయ మహా కుంభాభిషేకం బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలను సారెను సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించి, స్వామివారిని ఊరేగించారు.

వ్యక్తిత్వ వికాస శిక్షకుడిగా బాబు



సినీ నటుడు ప్రదీప్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న బాబు

ఐరాల: మండలంలోని కాణిపాకం గ్రామానికి చెందిన డి.బాబు వ్యక్తిత్వ వికాస శిక్షకుడిగా అధికారిక గుర్తింపు సంపాదించారు. చిత్తూరు ప్రభుత్వ పీవీకేఎన్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసి ఆ సంస్థ అధినేత గంప నాగేశ్వరరావు, ప్రముఖ సినీ, టీవీ నటుడు కె.వి.ప్రదీప్ చేతుల మీదుగా వ్యక్తిత్వ వికాస శిక్షకుడిగా ధ్రువపత్రం అందుకున్నారు. తాను ఉచితంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తానని తెలిపారు.



విద్యుత్ దీపాలంకరణలో చిత్తూరు రైల్వేస్టేషన్



చిత్తూరు: ర్యాలీలో పాల్గొన్న పీవీకేఎన్ విద్యార్థులు, అధ్యాపకులు

దేశభక్తి చాటేలా హర్‌ఘర్ తిరంగా

ఐరాల: ప్రతి విద్యార్థి దేశంపై భక్తి భావం కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రెడ్డిరామరాజు అన్నారు. బుధవారం కళాశాల విద్యార్థులు, ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి మండల బీజేపీ మండల నాయకులు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కళాశాల నుంచి మండల కేంద్రం వరకూ కొనసాగింది.

సమరయోధులుగా చిన్నారులు

చిత్తూరు కలెక్టరేట్: స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో విచ్చేసిన చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారని విజయం పాఠశాల అకడమిక్ డైరెక్టర్ శైలజ అన్నారు. బుధవారం నగరంలోని విజయం పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

దేశం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను మరవకూడదని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి అన్నారు. ఆ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ ని కళాశాల ప్రాంగణం నుంచి గాంధీ సర్కిల్ వరకు నిర్వహించారు.

జాతీయ జెండాల వితరణ

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో బీజేపీ నగర సెంట్రల్ అధ్యక్షులు షణ్ముగం జాతీయ జెండాలను అందజేశారు. ఎంజీఆర్‌వీధి, ఎంఎస్ఆర్‌సర్కిల్, వేపమానువీధి, పాతబస్టాండు ప్రాంతాల్లో స్థానికులకు 500 జెండాలు ఉచితంగా ఇచ్చారు. మరోవైపు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

విద్యార్థుల తిరంగా ర్యాలీ

పూతలపట్టు: మండలంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు క్రాస్ రోడ్డు వరకు ఈ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం నాగరత్నం, ఉపాధ్యాయులు దేవిక, రమేష్ పాల్గొన్నారు.







పూతలపట్టు: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, చిత్తూరు: సమరయోధుల వేషధారణలో చిన్నారులు, ఐరాల: జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

నేడు జిల్లాకు మంత్రి రాక

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ నెల 15న జిల్లా కేంద్రానికి విచ్చేయనున్నారని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొంటారన్నారు. ఆయన ఉదయం 7.30 గంటలకు చిత్తూరుకు చేరుకుని మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు.

ఎంపీడీఓగా అబ్దుల్ కలాం

తవణంపల్లె: తవణంపల్లె ఎంపీడీఓగా బుధవారం అబ్దుల్ కలాం అజాద్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో నెల్లూరు జిల్లాకు వెళ్లిన అబ్దుల్ కలాం ఆజాద్‌ను మళ్లీ ఈ స్థానంలోనే నియమించారు.

ఇంటివద్దకే వైద్యసేవలు

గుడిపాల: ఇంటివద్దకే వెళ్లి, ప్రతి రోగికి వైద్య సేవలు అందజేస్తున్నట్లు బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. మరకాలకుప్పంలో బుధవారం 104 వైద్యసేవలను గ్రామంలో అందజేశారు. 67 మందికి మందులను అందజేశారు.

విద్యార్థుల ప్రజ్ఞాధారణ

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రసాయన శాస్త్రంలోని మూలకాలతో ప్రజ్ఞాధారణ చేశారు. పాఠశాలలో బుధవారం హెచ్ఎం రాజ్యలక్ష్మి అధ్యక్షతన ఆవర్తన పట్టిక ద్వారా ప్రజ్ఞాధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో 9వ తరగతి లహరి, పార్థసారధి ఆవర్తన పట్టికలోని 118 మూలకాలతో ప్రజ్ఞాధరణ చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ, తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు గతంలో 25 గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమాలను నిర్వహించారన్నారు. గణిత అవధాని, ఏపీ గణిత ఫోరం ఉపాధ్యక్షులు అరుణశివప్రసాద్ మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థిని బహుముఖ ప్రజ్ఞాశాలిగా తీర్చిదిద్దవచ్చ న్నారు. ఈ ప్రజ్ఞాధారణ నిర్వహించిన టేకుమంద ఉపాధ్యాయుడు షంషీర్‌ఖాన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవి, ప్రేమకృష్ణ, రమాదేవి, పిళ్లారప్ప, సంపంగి, భారతి, ధనశేఖర్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శారీరక ధృఢత్వానికి క్రీడలు

తవణంపల్లె: శారీరక దృడత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, అరగొండ మాజీ సర్పంచ్ రాజేశ్వరమ్మ పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని అరగొండ అపోలో సంపూర్ణ ఆరోగ్య కేంద్రం వద్ద గ్రామీణ క్రీడాకారులకు వాలీబాల్, క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఆమె క్రీడాకారులకు పరికరాలను అందజేశారు.

తహసీల్దార్‌ను కలిసిన డీలర్లు

గుడిపాల: కొత్త తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని మండల రేషన్ డీలర్లు బుధవారం కలిశారు. మండల రేషన్‌షాపు డీలర్ల సంఘం అధ్యక్షుడు మోహన్ ఆధ్వర్యంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ, డీలర్లు నిత్యావసర సరుకులను సకాలంలో అందజేయాలన్నారు. మండలానికి డీలర్లు మంచి పేరు తీసుకురావాలని వారికి సూచించారు.

భవిష్యత్ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులను భవిష్యత్ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. బుధవారం నగరంలోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఇన్‌స్పైర్ మనక్ గైడ్ టీచర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీచర్లు విద్యార్థులను ఆవిష్కరణల వైపు ప్రోత్సహించాలన్నారు. డీఈఓ దేవరాజు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్‌ల ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం ఇన్‌స్పైర్ మనక్ రిజిస్ట్రేషన్‌లు తప్పనిసరిగా చేయించాలన్నారు. కొనుగోలు చేసే ప్రాజెక్టులను విద్యార్థుల చేత ప్రదర్శిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మేనేజ్‌మెంట్ పాఠశాల ఇన్‌స్పైర్ మనక్ లో పాల్గొనాలన్నారు. ఏ పాఠశాలకు మినహాయింపు లేదని చెప్పారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి మేనేజ్‌మెంట్ నుంచి తప్పనిసరిగా ఐదు ప్రాజెక్టుల నామినేషన్‌లను రూపొందించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీసీ జిల్లా సమన్వయకర్త బాలచైతన్య, బయోడైవర్సిటీ కో–ఆర్డినేటర్ సుధాకర్, మాజీ సైన్స్ ఆఫీసర్ శశిధర్, రిసోర్స్‌పర్సన్ నందకుమార్, బావాజాన్, పలు మండలాల గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం

గుడిపాల: అందరూ కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే గురజాల అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే మాట్లాడుతూఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేసుకోవాలని మిగతా సమయంలో అభివృద్ధిపై శ్రద్ధ చూపాలని సూచించారు.

మురుగు తొలగించాలని ఆందోళన



ఆండారెడ్డిపల్లె వద్ద రోడ్డుపై ఆందోళన చేస్తున్న స్థానికులు

బంగారుపాళెం:మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఆండారెడ్డిపల్లె వద్ద జాతీయ రహదారిపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో బుధవారం స్థానికులు ఆందోళనకు దిగారు. దీంతో స్థానిక ప్రజలందరూ కలిసి రహదారికి అడ్డంగా రాళ్లు, కొయ్యలు అడ్డుపెట్టి రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న సీఐ లక్ష్మయ్య సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులు సీఐకి సమస్యను గురించి వివరించారు. ఐదు నెలల నుంచి చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోందన్నారు. రహదారి పక్కన నివాసముంటున్న ప్రజలకు ఇబ్బందికరంగా ఉందని చెప్పారు. దీంతోపాటు రోడ్డు గుంతలమయంగా మారిందన్నారు. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేదని వాపోయారు. అయితే ఎంపీడీఓ దృష్టికి సమస్యను తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సీఐ తెలపడంతో ఆందోళన విరమించారు.

నిరాశ్రయుల కేంద్రంలో వైద్యశిబిరం



చిత్తూరు అర్బన్: నగరంలోని గంగనపల్లె కూడలి వద్ద ఉన్న నిరాశ్రయుల కేంద్రంలో బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. టెలిఫోన్‌కాలనీ వద్ద ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు ప్రశాంతి, సిబ్బంది కలిసి వైద్య శిబిరాన్ని నిర్వహించి, నిరాశ్రయులకు పరీక్షలు చేశారు. సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సపోర్ట్ సంస్థ నిర్వాహకులు జోసెఫ్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన ఈ-క్రాప్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ సుధాకర్

తవణంపల్లె: మండలంలో రైతులు సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఇన్‌చార్జి తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఈ–క్రాప్ నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రతి రైతు పొలంలోకి వెళ్లి పంటలను పరిశీలించి ఈ–క్రాప్ నమోదు చేయించాలని ఆదేశించారు. సెప్టెంబర్ 15వ తేదీ లోపు ఈ–క్రాప్ నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. వ్యవసాయాధికారి ప్రవీణ్ మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ పంటలు 3,465 ఎకరాలు, మామిడి పంట 12,536 ఎకరాలు, సెరికల్చర్ 280 ఎకరాల్లో ఈ–క్రాప్ పంట నమోదు చేయాలని సూచించారు. వీఆర్‌ఓ, రైతు సేవా కేంద్ర సిబ్బందికి రైతులు సహకరించాలన్నారు. నిర్ణీత గడువులోగా ఈ–క్రాప్ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో భూ రీసర్వే డీటీ వెంకటరమణ, ఏఎస్ఓ నాగశాంతి పాల్గొన్నారు.